క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లిలోని గీతామందిరం 24వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అర్చకులు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో బుధవారం శ్రీవల్లి దేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్యస్వామి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ స్థాపన నిర్వహించారు. పాలెపు రవీందర్‌శర్మ, నరహరిశర్మ, రాముశర్మ, విద్యాధరశర్మ, రామచంద్రశర్మ, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, బద్దం రాంరెడ్డి, చేపూరి శ్రీకర్, శాగ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

బోయినపల్లి: గ్రామాల్లో దొంగతనాలు, నేరాల నియంత్రణకు ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వేములవాడ రూరల్ సీఐ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని విలాసాగర్‌లో మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్సై శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్లటౌన్: కరీంనగర్ జిల్లా సహకార బ్యాంకు పటిష్టత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. సిరిసిల్ల కేడీసీసీబీ ఖాతాదారుడు బల్లెపు స్వామి ఇటీవల మృతిచెందగా బుధవారం బాధిత కుటుంబానికి రూ.2లక్షలు పీఎంజేజేబీవై చెక్కు అందించారు. బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, సిరిసిల్ల ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాసు తదితరులున్నారు.

ఆలయానికి విరాళం

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో ఈనెల 20నుంచి 25 వరకు జరుగనున్న పోచమ్మ బోనాల ఉత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠాపన, జాతర ఉత్సవాల కోసం గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.46,800 అందజేశారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఇందులో ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు.

అయోధ్య శ్రీరాముని చిత్రపటాలు పంపిణీ



రాముని చిత్రపటాలు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఇంటింటికీ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని చిత్రపటాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని 14 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి వీటిని అందజేశారు. దుంపెన స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

బోయినపల్లి: మండలకేంద్రంలో యువకులు, విలాసాగర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళి అర్పిస్తూ బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బోయినపల్లి అంబేద్కర్ చౌరస్తాలో యువకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. విలాసాగర్ బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్, ఎస్సై ఎల్. శ్రీకాంత్, బోయినపల్లి యువమిత్ర యూత్ క్లబ్ యువకులు తదితరులున్నారు.

ఎన్నికలు రాగానే యాత్రలు గుర్తొస్తాయా?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికలు వచ్చినపుడే బీజేపీ నాయకులకు యాత్రలు గుర్తొస్తాయా అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జేటోని అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో యాత్రలు చేయడం తప్ప అభివృద్ధి, సంక్షేమం గురించి ఆలోచన లేదన్నారు. నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పరుశురాం, మునిగెల రాజు, గడ్డం మధుకర్, భరత్ గౌడ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వసంత పంచమి



చందుర్తి : జోగాపూర్ పాఠశాలలో సరస్వతి దేవికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు



గంభీరావుపేట: విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలోని వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్వదినం కావడంతో భక్తులు ఇష్టదైవాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సరస్వతి పూజలు నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు వేదపండితులచే అక్షరాభ్యాసం చేయించారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతిదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

చందుర్తి : మండలంలోని బండపల్లి అంగన్‌వాడీ మొదటి కేంద్రంలో వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. జోగాపూర్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త న్యాత పద్మ, పంచాయతీ కార్యదర్శి రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరెడ్డి, ఉపాధ్యాయులు సత్యప్రవీణ్, భూపతి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని నాగంపేట ఉన్నత పాఠశాలలో రుద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పురోహితులు రాచర్ల అరవిందశర్మ, ప్రముఖ వైద్యులు ఆంజనేయులుగౌడ్, ఎంపీటీసీ నాగభూషణం, ఫౌండేషన్ సభ్యులు ఎల్లం, విజయ్, తిరుమల్, సంజీవ్, భగవాన్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు దేవాలయాలతో పాటు రాచర్ల బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ పాఠశాలలో వేడుకలు జరిగాయి. వరుస రామకృష్ణ –శ్రావణి దంపతులు విద్యార్థులకు పలకలు సమకూర్చారు. విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకుడు మధు గుండయ్య శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: గర్జనపల్లిలో మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సుశీల, వైస్ ఎంపీపీ హేమ, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: పూజల్లో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు



వీర్నపల్లి: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

బంద్‌ను విజయవంతం చేయాలి



బోయినపల్లి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): కార్మిక సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్, బీడీ కార్మికులు పోసు సత్యనారాయణ, భాస్కర్, మహేందర్, నాగరాజు పాల్గొన్నారు.

కోనరావుపేట: ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కదారి రాములు కోరారు. మండలకేంద్రంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకురాలు గొట్టె రుక్మిణీ, భవననిర్మాణ రంగ నాయకులు బొల్లె బాబు, సుతారి సంఘం నాయకులు శ్రీను, శేఖర్, రాజన్న, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు , రైతుసంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ పోస్టర్‌ను సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రజాకార్మిక సంఘం నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ మండలకేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. సీఐటీయూ నాయకులు రాజేలయ్య గుంటుకు నరేందర్, మల్లారపు దేవయ్య రైతు సంఘం నాయకులు జంగం అంజయ్య ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వాలి



అనుమానితుల ఫొటోలు చూపుతున్న ఎస్సై

చందుర్తి(వేములవాడ): గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రేమానందం కోరారు. మండలంలోని మల్యాలలో బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై దొంగతనాలకు పాల్పడుతున్న అనుమానితుల ఫొటోలు చూపించి గ్రామస్తులకు చూపించారు. ఎక్కడైనా కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యాపార సముదాలతో పాటు ఇళ్లలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువకులు రక్షక దళాలు ఏర్పాటు చేసుకొని రాత్రిపూట గస్తీ నిర్వహించాలన్నారు. వివేకానంద యూత్‌సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వారు, అపరిచి వ్యక్తులు వస్తే అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేశ్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.. వ్యాపారం పేరుతో గ్రామాల్లో తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే చిన్నారులపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. దొంగతనాలకు పాల్పడకుండా యువకులు గస్తీ నిర్వహించాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయనను జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌గా స్థానచలనం కలిగింది. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ ఏఈవో డి.లావణ్యను మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

పుష్పగుచ్ఛం అందజేత

ఎల్లారెడ్డిపేట: సీఎం రేవంత్‌రెడ్డి సలహాదా రు వేం నరేందర్‌రెడ్డిని మండలంలోని కోరుట్లపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గూడ విజయ్‌రెడ్డి బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని తాగు, సాగునీరు, సంక్షేమ పథకాలు, రోడ్లు, మురుగుకాల్వల సమస్యలపై ఆయన వినతిపత్రం అందించారు.

ఆటో, కారు ఢీ



ప్రమాదానికి గురైన ఆటో, కారు

వేములవాడరూరల్: వేములవాడ మండలం పోచెట్టిపల్లి–కోనాయపల్లి గ్రామాల మధ్య కారు, ఆటో ఢీకొన్న సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మర్రిపల్లికి చెందిన తుపాకుల అర్జున్ తీవ్రంగా గాయపడగా.. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో క్షతగాత్రుడు మనుపటి పర్శరాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడటౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ

ముస్తాబాద్: మండల తహసీల్దార్‌గా బుధవారం సురేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన గణేశ్ సిరిసిల్ల కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వర్తిస్తున్న సురేశ్‌ను ముస్తాబాద్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. బదిలీపై వెళ్లిన గణేశ్, తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సురేశ్‌ను రెవెన్యూ సిబ్బంది అభినందించి, సన్మానించారు.

రోడ్డు విస్తరణపై సందిగ్ధం

- రూ.30కోట్ల నిధులతో పనులు
- టెండర్ ప్రక్రియ పూర్తయినా మొదలుకాని పనులు
- వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు



డ్రైనేజీ నిర్మాణం దాటి మొదలైన నిర్మాణాలు

గంభీరావుపేట(సిరిసిల్ల): కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో మండలకేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సందిగ్ధం నెలకొంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలకేంద్రంలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.30కోట్లు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ కూడా పూర్తయింది. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారింది. దీంతో మంజూరైన నిధులతో పనులు ప్రారంభమవుతాయో, లేదోనని సర్వత్రా చర్చ జరుగుతోంది. పనులు మొదలు కాలేదని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇస్తుందో లేదోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మొదలైన నిర్మాణాలు

మండలకేంద్రంలో రోడ్డు విస్తరణ కోసం గ్రామపంచాయతీ పాలకవర్గం అప్పట్లో 80 ఫీట్లకు తీర్మానం చేసింది. డ్రైనేజీ దాటి ఉన్న నిర్మాణాలను తొలగించారు. సానుకూలంగా ఉన్న వారి ఇళ్లను కూల్చారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిసింది. రోడ్డు విస్తరణ గురించి చడీచప్పుడు లేకపోవడంతో రోడ్డుపై వ్యాపార దుకాణ యజమానులు మళ్లీ డ్రైనేజీ దాటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పట్లో రోడ్డు విస్తరణ చేపడుతారో లేదోనన్న ప్రజలు భావిస్తున్నారు.

ట్రాఫిక్ తిప్పలు

మండలకేంద్రంలో నిత్యం ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యతో రోడ్డుపై పార్కింగ్‌కు ఇబ్బందిగా మారుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపై నడవాలంటే జంకుతున్నారు. ప్రధాన రహదారిపై వాహనం వస్తే మరో వాహనం వెళ్లక ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతున్నాయి. జిల్లాలో అన్ని మండలాల్లో రోడ్డు వెడల్పు జరిగినా ఒక్క గంభీరావుపేటలో మాత్రమే రోడ్డు విస్తరణ జరగలేదు. రోడ్డు విస్తరణ కోసం గ్రామ పంచాయతీ రోడ్డువెంబడి ఇళ్లు, దుకాణ యజమానులతో చర్చలు జరిపి 80 ఫీట్లకు తీర్మానం చేశారు. ఇళ్లు కోల్పోయే వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

> **ప్రభుత్వానికి నివేదించాం**
>
> మండలకేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు మొదలు కాలేదని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం అనుమతి ఇస్తే పనులు మొదలవుతాయి. గతంలోనే టెండరు ప్రక్రియ పూర్తయింది. – నరేందర్, ఆర్అండ్‌బీ ఏఈ, గంభీరావుపేట

ప్రజలను మోసం చేసేందుకే ప్రజాహిత యాత్ర



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట: ఐదేళ్లలో ఒక్కసారి కూడా గ్రామాల్లోకి రాని ఎంపీ బండి సంజయ్ మరోసారి ప్రజలను మోసం చేసేందుకే ప్రజాహిత యాత్ర చేపడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ మండలానికి చేసిందేమీ లేదన్నారు. బీజేపీ నాయకులకు ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు, పల్లెలు గుర్తుకువస్తాయన్నారు. మండలాభివృద్ధికి ఎలాంటి నిధులు తేనందునే ప్రజలు కూడా ఈ యాత్రకు దూరంగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపాల్, నాయకులు పెంతల శ్రీనివాస్, మాందాల లింభయ్య, గొట్టెశంకర్, గడిపెల్లి ఎల్లయ్య, రాస రవీందర్‌రెడ్డి, సదానందం, అజీమ్, సతీశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



గుర్తింపు కార్డులు అందిస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని జెడ్పీ ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొండూరు గాంధీబాబు చేతుల మీదుగా గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు హమీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగిస్వామి, ప్రధానోపాధ్యాయుడు దేవయ్య, విద్యాకమిటీ చైర్మన్ నవాజ్‌ఖాన్, ఎర్ర నర్సయ్య, రాజుగౌడ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో భాస్కరశర్మ

ముస్తాబాద్: ముస్తాబాద్ ఎంపీడీవోగా భాస్కరశర్మ బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎంపీడీవోగా పనిచేసిన భాస్కరశర్మ ఎన్నికల బదిలీల్లో భాగంగా ముస్తాబాద్‌కు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రమాదేవి జగిత్యాలకు బదిలీ అయ్యారు.



ఇల్లంతకుంట ఎంపీడీవో శ్రీనివాస మూర్తి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు నూతన ఎంపీడీవోలు బాధ్యతలు స్వీకరించారు. తంగళ్లపల్లి ఎంపీడీవోగా బి.వెంకటేశ్వర్లు, ఇల్లంతకుంట ఎంపీడీవోగా బి.శ్రీనివాస మూర్తి విధుల్లో చేరారు.

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ ఎంపీడీవోగా రాజీవ్‌మల్‌హోత్ర బాధ్యతలు చేపట్టారు. అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కోనరావుపేట: మండల ఎంపీడీవోగా శశికళ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఎంపీడీవోగా పనిచేసిన రామకృష్ణ బదిలీపై జగిత్యాల జిల్లాకు వెళ్లారు. పెద్దపల్లి జిల్లాలో ఎంపీడీవోగా పనిచేసిన శశికళను కోనరావుపేట ఎంపీడీవోగా నియమించారు. ఎంపీవో రాజు, ఎంపీటీసీ చారి, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.



జయశీల

బోయినపల్లి: మండల ఎంపీడీవోగా బీమా జయశీల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జయశీల బదిలీపై బోయినపల్లి వచ్చారు. బోయినపల్లి ఎంపీడీవోగా పనిచేసిన నల్లా రాజేందర్‌రెడ్డి జగిత్యాల జిల్లా మల్లాపూర్‌కు బదిలీపై వెళ్లారు. ఎంపీవో గంగాతిలక్, సూపరింటెండెంట్ రవీందర్, ఈజీఎస్ ఏపీఓ వనం సబిత ఉద్యోగులు ఆరిఫ్, గడ్డం శ్రీనివాస్, వంశీ తదితరులు ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ వేణుగోపాల్‌ను ఎంపీడీవో మర్యాదపూర్వకంగా కలిశారు.

వీర్నపల్లి : మండల ఎంపీడీవోగా సత్తయ్య బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు పెద్దపల్లిలో విధులు నిర్వహిస్తూ వీర్నపల్లికి బదిలీపై వచ్చారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

ఎల్లారెడ్డిపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. జెడ్పీటీసీ తండ్రి స్మారకార్థం నిర్వహిస్తున్న క్రీడాపోటీలలో భాగంగా బుధవారం సెమీఫైనల్స్ జరిగాయి. ఈ పోటీలను ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, పోలీసులు, మండల పరిషత్ సిబ్బంది మధ్య నిర్వహించారు. బ్యాడ్మింటన్ జట్టు, జర్నలిస్టుల జట్టుకు మధ్య జరిగిన మ్యాచ్‌లో మూడు పరుగుల తేడాతో బ్యాడ్మింటన్ జట్టు గెలుపొందింది.

కాంగ్రెస్ వైపు కౌన్సిలర్ల చూపు?

వేములవాడ: వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్లలో కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలతో కౌన్సిలర్లతో కొంతమంది పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. వైస్ చైర్మన్ ఎన్నికతోపాటు చైర్‌పర్సన్‌పై సైతం అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈనెల 12న జరగాల్సిన వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. బడ్జెట్ సమావేశాల అనంతరం వేములవాడకు చేరుకుంటున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌తో సమావేశమయ్యాక పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తమ సీట్లను ఖరారు చేసుకునేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సంక్షిప్త వార్తలు

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

వీర్నపల్లి : మండలంలోని కంచర్ల శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ముగ్గురు యువకులు కంచర్లలో వివాహ వేడుకలకు హాజరయ్యారు. మండలకేంద్రంలో మద్యంతాగి బైకుపై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కోనరావుపేటకు చెందిన ఒకరికి తీవ్ర, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

మరో ఘటనలో ఇద్దరికి..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామ శివారులోని కరీంనగర్ – సిరిసిల్ల రోడ్డుపై ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలకేంద్రానికి చెందిన బుర్ర ఎల్లయ్య, అత్త ఎల్లవ్వతో బైక్‌పై వేములవాడకు వెళ్తుండగా ఆరెపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో వెనుకనుంచి ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వెంకట్రావుపల్లిలో ఒకరు..

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారి వెంకట్రావుపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన కనుకయ్య బైక్‌పై వెళ్తుండగా కరీంనగర్ నుంచి వేములవాడ వైపు కారు వెంకట్రావుపల్లిలో బైక్‌ను ఢీకొంది. కనుకయ్య తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా కనుకయ్య బావుపేటలో ఆర్ఎంపీ అని తెలిసింది.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

చందుర్తి: కొత్తపేటలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయంలో హోమ పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, భక్తులు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీటీసీ నాగం కుమార్ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు.

పరీక్ష సామగ్రి అందజేత

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు పంతులవారి శంకర్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. వసంత పంచమి సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899